ప్రజావాణికి వినతుల వెల్లువ

- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు
- సమస్యలపై అధికారులకు 267 అర్జీలు

కలెక్టరేట్, సెప్టెంబర్ 23: ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి వారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సోమవారం జాతరను తలపించింది. జిల్లా నలుమూలల నుంచి వందల సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు, తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఇతర ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేశారు. వివిధ సమస్యలపై 267 దరఖాస్తులు రాగా, ఉన్నతాధికారులు వాటిని ఆయా శాఖల అధికారులకు అప్పగించారు. అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇస్తూ దరఖాస్తు దారులకు భరోసా కల్పించే ప్రయత్నం చేశారు. అయితే, అర్జీదారుల్లో అత్యధిక శాతం మంది ఇప్పటికే పలుమార్లు ప్రజావాణికి వచ్చి తమ గోడు వెళ్లబోసుకున్న వారే ఉన్నారు. వీరంతా అధికారుల హామీలపై సంతృప్తి చెందడం లేదు. కార్యాలయాలు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా తమకు మాత్రం న్యాయం జరుగడం లేదంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ గోడు వెళ్లబోసుకున్నారు.

అర్జీదారుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్

గురుకులాల్లో విద్యార్థులపై పట్టింపేది?

నగర శివారులోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో గల మహాత్మాజ్యోతిబా పూలే కొత్తపల్లి(న్యూ) పాఠశాలలో పిల్లల సంరక్షణపై సిబ్బంది కనీస శ్రద్ధ చూపడం లేదు. విద్యార్థులు గ్రూపులుగా ఏర్పడి ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఈ గురుకులంలో 5వ తరగతి చదువుతున్న మా కుమారుడు ఎల్.రామ్‌సేనపై కొంత మంది విద్యార్థులు దాడికి పాల్పడితే, ఫిర్యాదు చేసినా అధికారులు, సిబ్బంది పట్టనట్లు వ్యవహరిస్తున్నరు. మోకాలి కింద తీవ్రగాయం కావడంతో హాస్పిటల్‌కు తీసుకురావాల్సి వచ్చింది. మాకు న్యాయం జరుగుతుందనే ఆశతో ప్రజావాణికి వచ్చినం. ఫిర్యాదు పరిశీలించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

-ప్రభాకర్‌రాజు, లలిత దంపతులు, విద్యార్థి తల్లిదండ్రులు(కరీంనగర్)

దరఖాస్తుల ఆన్‌లైన్‌కు బారులు

కలెక్టరేట్, సెప్టెంబర్ 23 : ప్రజావాణిలో గతంలో రెండు, మూడు నిమిషాల వ్యవధిలోనే దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ఆయా శాఖల సిబ్బంది రసీదులు కూడా ఇచ్చేవారు. సోమవారం మాత్రం ఒక్కో దరఖాస్తు పూర్తయ్యేందుకు కనీసం ఎనిమిది నుంచి పది నిమిషాలు పట్టడంతో అర్జీదారులు ఆడిటోరియం బయట గంటల తరబడి బారులు తీరి నిరీక్షించడం కనిపించింది. గత వారం ప్రజావాణి నిర్వహించకపోవడంతో ఈసారి దరఖాస్తుదారుల సంఖ్య పెరుగడం, ఇటీవల జరిగిన బదిలీల నేపథ్యంలో అత్యధిక శాఖల్లో సిబ్బంది కొత్తగా రావడం, వారికి ప్రజావాణి అర్జీల నమోదుపై అవగాహన లేకపోవడంతో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ఆలస్యమైనట్లు అధికారులు పేర్కొన్నారు.

ఇండ్లు కూల్చివేస్తామని బెదిరిస్తున్నరు

25 ఏండ్లుగా బొమ్మకల్ గ్రామంలో గల 105 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో 55 ఇండ్లు నిర్మించుకుని నివసిస్తున్నం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక గ్రామపంచాయతీ అధికారులు మా ఇండ్లు కూల్చివేస్తామని బెదిరిస్తున్నరు. పలుమార్లు అధికారులు, సిబ్బంది వచ్చి మాపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. వారి తీరుపై రెండుసార్లు ప్రజావాణిలో ఫిర్యాదు కూడా చేశాం. ఎలాంటి స్పందన లేదు. కలెక్టర్ ఇప్పటికైనా స్పందించి మాకు న్యాయం చేయాలి. లేకుంటే కలెక్టరేట్ ఎదుట నిరాహారదీక్షలు చేస్తాం.

- బొమ్మకల్ గ్రామస్తులు, కరీంనగర్ రూరల్ మండలం

రిజర్వాయర్లను పరిశుభ్రంగా ఉంచాలి: మేయర్

భగత్‌నగర్‌లోని రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, సెప్టెంబర్ 23 : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని మంచి నీటి రిజర్వాయర్లలో ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించడంతోపాటు వాటిని పరిశుభ్రంగా ఉంచాలని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు ఆదేశించారు. రానున్న ఏడాది కాలం మేయింటనెన్స్, మరమ్మతు పనుల కోసం అంచనాలు తయారు చేసి టెండర్ పిలవాలని సూచించారు. సోమవారం 33వ డివిజన్‌లో భగత్‌నగర్ పోలీస్ క్వార్టర్స్ పరిధిలో తలెత్తిన తాగునీటి సమస్యల దృష్ట్యా భగత్‌నగర్ రిజర్వాయర్‌ను సందర్శించారు. రిజర్వాయర్ ఎదుట రోడ్డుపై వాల్స్ లీకేజీ మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. రిజర్వాయర్ సంపులో నీరు పోసే చోట చెత్తాచెదారం పడకుండా మూసి వేయాలని, చెడి పోయిన ప్యానల్ బోర్డును వెంటనే మరమ్మతు చేయాలన్నారు. రిజర్వాయర్‌కు రక్షణగా ఉన్న ప్రహరీ శిథిలమైందని, వెంటనే నూతన నిర్మాణానికి టెండర్ పిలిచి పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఈ అయూబ్ ఖాన్, ఏఈ గట్టు స్వామీ పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టు పనులన్నీ పూర్తి చేయాలి: నగర కమిషనర్

కార్పొరేషన్, సెప్టెంబర్ 23 : నగరంలో స్మార్ట్ సిటీ పథకం కింద చేపడుతున్న అభివృద్ధి పనులు అన్నింటిని మార్చి 25లోగా పూర్తి చేయాలని నగర కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం సమావేశ మందిరంలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టులపై సోమవారం ఇంజినీరింగ్ విభాగం అధికారులు, ఆర్వీ కన్సల్టెన్సీ అధికారులు, వివిధ ప్రాజెక్టుల ఏజెన్సీ కాంట్రాక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, మల్టీపర్పస్ పార్క్ చివరి దశ పనులతో పాటు పద్మనగర్ సమీకృత మార్కెట్ పనులను పూర్తి చేయాలని కోరారు. త్వరగా కశ్మీర్ గడ్డ సమీకృత మార్కెట్ పనులు ప్రారంభించి, వేగవంతం చేయాలన్నారు. 24/7 వాటర్ సప్లయి పాయిలెట్ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి.. ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఈ రాజ్ కుమార్, డీఈలు వెంకటేశ్వర్లు, ఓం ప్రకాశ్, అయూబ్ ఖాన్, శ్రీనివాస్, ఆర్వీ అధికారి సందీప్, ఏఈలు వివిధ ప్రాజెక్టుల ఏజెన్సీ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఆలయాల పునర్నిర్మాణానికి శ్రీప్రగతి భారీ విరాళం

రామడుగు, సెప్టెంబర్23 : గోపాల్‌రావుపేటలో హనుమాన్ ఆలయంతో పాటు ఊరి పోచమ్మ, నల్ల పోచమ్మ ఆలయాల పునర్నిర్మాణంలో భాగంగా స్థానిక శ్రీ ప్రగతి హైస్కూల్ యాజమాన్యం పాఠశాల వ్యవస్థాపకుల్లో ఒకరైన మండవ నాగేశ్వరరావు స్మారకార్థం రూ. లక్షా 11వేల 111 విరాళాన్ని పాఠశాల కరస్పాండెంట్ అన్నదానం రాధాకృష్ణ సోమవారం ఆలయాల అభివృద్ధి కమిటీ నిర్వాహకులకు అందించారు. ఇక్కడ ఆలయాల అభివృద్ధి కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ నేరెల్ల అంజయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ నార్ల రమేశ్, నేచర్ యూత్‌క్లబ్ అధ్యక్షుడు కాసారపు పరశురాములుగౌడ్, సభ్యులు ఎడవెల్లి మధు, పైండ్ల శ్రీనివాస్, కచ్చు లింగయ్య, కల్లెం అంజయ్య, అశోక్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

డబుల్ బెడ్రూం ఇండ్లు వెంటనే పూర్తి చేయాలి

చొప్పదండి, సెప్టెంబర్ 23: చొప్పదండి పట్టణం, ఆర్నకొండలో చేపట్టిన డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలంటూ బీజేపీ పట్టణాధ్యక్షుడు బత్తిని ప్రశాంత్ ఆధ్వర్యంలో 200 మంది లబ్ధిదారులు, నాయకులు, కార్యకర్తలు సోమవారం తహసీల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. నెల రోజుల్లో ఇండ్ల పనులు ప్రారంభించి, లబ్ధిదారులకు న్యాయం చేయకపోతే గ్రామ గ్రామాన నిరాహార దీక్ష శిబిరాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు.

అద్దెకున్న వివాహితపై లైంగిక వేధింపులు?

జమ్మికుంట, సెప్టెంబర్ 23: తన ఇంట్లో అద్దెకున్న వివాహితపై ఓ ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడనే ఆరోపణలు పట్టణంలో చర్చనీయాంశమయ్యాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. పక్క మండలానికి చెందిన ఓ వ్యక్తి జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఓ కాలనీలో స్థిరపడ్డాడు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. వివాదాస్పదుడైన ఇతడిపై గతంలోనూ పలు ఆరోపణలున్నాయి. కొద్ది కాలంగా సదరు ఉపాధ్యాయుడు విధుల్లో భాగంగా వేరే జిల్లాలో ఉండేవాడని సమాచారం. దీంతో అద్దెకు వచ్చిన ఓ కుటుంబం కొన్ని నెలలుగా సాఫీగా ఉంటుండగా, ఇటీవల సదరు టీచర్‌కు పక్క జిల్లాలోని ఓ మండలానికి ట్రాన్స్‌ఫర్ అయ్యింది. ఇంటి నుంచే విధులకు వెళ్తున్నాడు. అప్పటి నుంచి అద్దెకున్న వివాహితను వేధింపులకు గురిచేసినట్లు తెలిసింది. అంతేకాకుండా ఫోన్ చేయడం.. చాటింగ్.. తదితర వేధింపులు తాళలేక కుటుంబ సభ్యులకు బాధిత వివాహిత మొర పెట్టుకున్నట్లు సమాచారం. టీచర్‌పై బాధిత ఫ్యామిలీ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కాగా, రంగంలోకి దిగిన కాలనీకి చెందిన కొందరు పెద్దలు కాంప్రమైజ్ చేస్తున్నారని సమాచారం.

గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలి: ఎమ్మెల్యే కవ్వంపల్లి

మానకొండూర్: విద్యార్థులకు షూస్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

మానకొండూర్, సెప్టెంబర్ 23: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు గుర్తించి వాటిని సత్వరమే పరిష్కరిస్తూ గ్రామాల అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శులు కృషిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. సోమవారం మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన పలు అంశాలపై చర్చించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా మండలానికి వచ్చిన ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరలక్ష్మి, ఎంపీవో కిరణ్‌కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు షూ పంపిణీ

మానకొండూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావుతో కలిసి విద్యార్థులకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ షూస్ పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు షూస్ పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ రాంబాబు, ఎంపీడీవో వరలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ మర్రి ఓదెలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

మానకొండూర్ మండలంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు వైద్య చికిత్స కోసం మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు.

పేద మహిళకు చేయూత

గంగాధర, సెప్టెంబర్ 23 : గర్శకుర్తి గ్రామానికి చెందిన పేద మహిళ దాసరి వైష్ణవికి జీవనోపాధి కోసం స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం కుట్టు మిషన్‌ను అందజేశారు. కాగా, కుట్టు మిషన్ అందజేసిన లయన్స్ క్లబ్ సభ్యులకు వైష్ణవి కృతజ్ఞతలు తెలిపింది. ఇక్కడ లయన్స్ క్లబ్ సభ్యులు మిట్టపెల్లి ప్రవీణ్‌కుమార్, గుర్రం బాపురెడ్డి, మిట్టపెల్లి రాజశేఖర్, శ్రీరాం శ్రవణ్, శ్రీనివాస్, అనిల్, రమేశ్, మల్లికార్జున్, రమేశ్, అరవిందస్వామి ఉన్నారు.

30 వరకు బీఎస్సీ ఫీజు చెల్లించాలి

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 23 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీఎస్సీ హానర్స్ నాలుగో సెమిస్టర్ ఫీజు ఈ నెల 30వ తేదీలోగా చెల్లించాలని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధ రుసుము రూ. 300తో అక్టోబర్ 4వ తేదీలోగా ఫీజు చెల్లించవచ్చని సూచించారు.

'లా కాలేజీపై చర్యలు తీసుకోవాలి'

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 23 : కరీంనగర్‌లోని జస్టిస్ కొమురయ్య లా కాలేజీపై చర్యలు తీసుకోవాలని శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ వరప్రసాద్‌కు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని జస్టిస్ కొమురయ్య లా కాలేజీ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి మొదటి సంవత్సరం స్పెషల్ ఫీజు, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుంటూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు హేమంత్, రాము యాదవ్, యూనివర్సిటీ ఇన్‌చార్జి మర్రి కల్యాణ్, నాయకులు సన్నీ ఉన్నారు.

హుండీల లెక్కింపు

కమాన్ చౌరస్తా, సెప్టెంబర్ 23: జిల్లా కేంద్రంలోని ప్రశాంత్‌నగర్ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం, మంకమ్మతోటలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీలను సోమవారం లెక్కించినట్టు ఆలయ ఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో రూ.90,321, వేంకటేశ్వర స్వామి ఆలయంలో రూ. 1,55,257 సమకూరినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ పరిశీలకుడు సత్యనారాయణ, ఆలయ వ్యవస్థాపక వంశీయ ధర్మకర్త పిట్టల శ్రీనివాస్, ఆలయ అర్చకులు, సిబ్బంది, శ్రీ రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరు: మంత్రి పొన్నం

సైదాపూర్/ చిగురుమామిడి, సెప్టెంబర్ 23: హుస్నాబాద్ నియోజకవర్గంలో రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి రూ.60 కోట్ల నిధులు మంజూరయ్యాయని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. సోమవారం సైదాపూర్, చిగురుమామిడి మండల కేంద్రాల్లో ఆయన మాట్లాడుతూ, సైదాపూర్ మండలంలోని రాములపల్లి– ఎల్లంపల్లి ఎక్స్‌రోడ్డు, ఘనపూర్– ఆకునూర్ రోడ్లతో పాటు పెర్కపల్లి బ్రిడ్జి, ఘనపూర్ – ఆకునూర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు వచ్చాయని తెలిపారు. నియోజకవర్గంలో ఇంకా పెండింగ్‌లో ఉన్న రోడ్లు, ఇతర పనులకు రెండో విడుతలో నిధులు మంజూరయ్యేలా చూస్తానన్నారు. అలాగే చిగురుమామిడి మండలం లంబాడి పల్లెకు ఆర్ అండ్ బీ రోడ్డు, ముదిమాణిక్యం వయ లంబాడి పల్లె వరకు, సుందరగిరి ఎక్స్ రోడ్ నుంచి ఉల్లంపల్లి–మడద వరకు, చిగురుమామిడి ఎక్స్ రోడ్ నుంచి బంజరపల్లి వరకు, గాగిరెడ్డిపల్లి నుంచి లంబాడి పల్లి వరకు, చిగురుమామిడి– పీచుపల్లి రోడ్డు, చిగురుమామిడి బైపాస్ నుంచి రేకొండ రోడ్డు వరకు, లంబాడి పల్లె రోడ్డుతోపాటు బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు దొంత సుధాకర్, కంది తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పిటిసి గీకురు రవీందర్, నాయకులు పాల్గొన్నారు. అలాగే కారోబార్లు, బిల్ కలెక్టర్లకు అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శి హోదా కల్పించి వారికి ఉద్యోగావకాశాలు ఇవ్వాలని కోరుతూ చిగురుమామిడిలో గ్రామ పంచాయతీ కారోబార్ సిబ్బంది, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి గణేశ్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నంకు వినతి పత్రం అందజేశారు.

భూసమస్యలు పరిష్కరించాలి: కలెక్టర్

కలెక్టరేట్, సెప్టెంబర్ 23 : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి ముగిసిన అనంతరం రెవెన్యూ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ధరణిలో నెలకొన్న సాంకేతిక సమస్యల మూలంగా భూముల వివరాలు నమోదు కాలేదని, దరఖాస్తులు చేసుకున్న వారి భూసమస్యలు పెండింగ్‌లో ఉండడంతో రైతులంతా ఇబ్బందులకు గురయ్యారని పేర్కొన్నారు. అధికారులు వీటిపై దృష్టి సారించి ధరణిలో నమోదు చేయాలని సూచించారు.

ఎమ్మెల్యేకు పార్టీ శ్రేణుల ఘన స్వాగతం

హుజూరాబాద్ టౌన్, సెప్టెంబర్23: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి నియోజకవర్గంలోని నేతలంతా సోమవారం ఘన స్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి హుజూరాబాద్‌కు వస్తున్న కౌశిక్‌రెడ్డికి పరకాల క్రాస్ రోడ్ వద్ద ఘన స్వాగతం పలికారు. హనుమకొండ నుంచి హుజూరాబాద్‌కు చేరుకోగానే హుజూరాబాద్, జమ్మికుంట చైర్మన్లు గందె రాధికాశ్రీనివాస్, తక్కల్లపల్లి రాజేశ్వర్‌రావుతో పాటు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, కౌన్సిలర్లు, ముఖ్య కార్యకర్తలు నాయకులంతా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని కలిశారు. ఆయన వారందరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ నియోజకవర్గ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భారీ కాన్వాయ్ తో జమ్మికుటకు బయలు దేరి వెళ్లారు.

బాధిత కుటుంబానికి ప్రముఖుల పరామర్శ

జమ్మికుంట, సెప్టెంబర్23: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు, తదితరులు పరామర్శించారు. తుమ్మేటి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అలాగే రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వీ ప్రణవ్‌బాబు, తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

వీణవంక, సెప్టెంబర్ 23: కొండపాక మాజీ ఎంపీటీసీ ఆవాల మణెమ్మ అనారోగ్యంతో మృతిచెందగా, ఆమె కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పరామర్శించారు. మణెమ్మ భౌతికకాయాన్ని వైద్య కళాశాలకు అందజేయడంపై కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు గెల్లు శ్రీనివాస్ యాదవ్, బండ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎంపీపీ రేణుక–తిరుపతిరెడ్డి, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ చుక్క రంజిత్, జమ్మికుంట పట్టణాధ్యక్షుడు రాజ్ కుమార్, తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ సామ్రాజ్యం, నాయకులు జేకే, అఖిల్, జానీ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్‌ను తలదన్నేలా రేవంత్ పాలన: మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్

చిగురుమామిడి, సెప్టెంబర్ 23: ఇందిరమ్మ పాలనను తెస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో, రాయలసీమ ఫ్యాక్షన్‌ను తలదన్నేలా రాక్షస పాలన కొనసాగిస్తున్నదని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ మండిపడ్డారు. గాంధీ దవాఖానలోని అధ్వాన పరిస్థితిని అధ్యయనం చేసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను నిర్బంధంగా అరెస్టు చేసి తీసుకెళ్లిన తీరు అమానుషమని పేర్కొన్నారు. మెదక్ జిల్లా నరసాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి స్వగ్రామంలో ఆమె ఇంటిపై కాంగ్రెస్ గూండాల దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సతీశ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ నాయకత్వం ప్రోత్సాహంతోనే ప్రతిపక్ష నాయకులపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. దాడి చేసిన కాంగ్రెస్ గూండాలను గుర్తించి తక్షణమే వారిని అరెస్టు చేసి, కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

'సతీశ్‌కుమార్‌ను విమర్శించే స్థాయి మీకు లేదు'

సైదాపూర్, సెప్టెంబర్ 23: మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య ధ్వజమెత్తారు. మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రైతులకు ఇంతవరకూ రుణమాఫీ చేయక, రైతుబంధు ఇవ్వకపోగా, ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకు ప్రతిపక్ష నాయకులపై అర్థం లేని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో రైతుబంధు సమితి మాజీ మండల కోఆర్డినేటర్ రావుల రవీందర్‌రెడ్డి, నాయకులు బత్తుల లక్ష్మీనారాయణ, పైడిపల్లి రవీందర్, పొడిశెట్టి కొమురయ్య, బర్మావత్ శంకర్‌నాయక్, బత్తుల జయపాల్, వెన్నమల్ల సురేశ్, రవినాయక్ తదితరులు ఉన్నారు.

'ఎస్ఐపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి'

రాంనగర్, సెప్టెంబర్ 23: గతంలో సైదాపూర్‌లో పనిచేసిన ఎస్ఐ జున్ను ఆరోగ్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆ మండలానికి చెందిన వివిధ గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. ఆయన భూతగాదాల్లో జోక్యం చేసుకొని ఇరుపక్షాలకు న్యాయం చేయకుండా డబ్బులు తీసుకుని కేసులు పెట్టి బెదిరించారని ఆరోపించారు. ఈ మేరకు భాస్కర్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, రాజిరెడ్డి, కొండలరావు, శ్రీధర్ తదితరులు ఎస్ఐ బాధితుల సంఘం ఏర్పాటు చేసుకొని సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. ఎస్ఐపై ఆరోపణలు రాగానే బదిలీ చేసి చేతులు దులుపుకొన్నారని, తమకు న్యాయం జరుగడం లేదని మీడియాకు తెలిపారు.

సంక్షేమ బోర్డు కోసమే సంఘర్షణ యాత్ర

వీణవంక, సెప్టెంబర్ 23: ప్రభుత్వం రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సంఘర్షణ యాత్రను ప్రారంభించామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో సంఘర్షణ యాత్రను ప్రారంభించారు. ఈ యాత్రలో భాగంగా ఈ నెల 27న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు జిల్లాలోని రవాణా రంగ కార్మికులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు పుణ్ణం రవి, ప్రధానకార్యదర్శి చెలికాని శ్రీనివాస్, సీఐటీయూ మండల కన్వీనర్ పిల్లి రవియాదవ్, కో కన్వీనర్ వెంకటేశ్, నాయకులు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధు లబ్ధిదారుడికి బెదిరింపులు

జమ్మికుంట, సెప్టెంబర్ 23: పాత మున్సిపల్ పక్కన గల స్థలంలో శ్రీనివాస్ టైర్ వర్క్ షాపును నిర్వహిస్తున్న తనను కొందరు వ్యక్తులు చంపుతామని బెదిరించారని దళితబంధు లబ్ధిదారుడు కన్నూరు వెంకటయ్య ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. ఇటీవల కొందరు వ్యక్తులు తన షాప్‌తొలగించి తనకు జీవనోపాధిని లేకుండా చేశారని, స్థానిక అధికారులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు కల్పించుకుని బెదిరింపులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

VEHICLE FOR SALE
★MARUTHI SWIFT vxi-2021
Model. Accidental Vehicle.
Vehicle No: TS02FH1692, Contact: INDUSIND Bank. Cell: 99593 45748.
NTK-000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆర్వో, శానిటరీ సూపర్‌వైజర్ బదిలీ

కార్పొరేషన్, సెప్టెంబర్ 23: కరీంనగర్ నగరపాలక సంస్థలోని రెవెన్యూ విభాగంలో పని చేస్తున్న ఆర్వో ఆంజనేయులు రామగుండం కార్పొరేషన్‌కు, శానిటరీ సూపర్‌వైజర్ రాజమనోహర్ వరంగల్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కార్మిక వ్యతిరేక విధానాలను అడ్డుకుంటాం

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 23: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను పోరాటాలతో అడ్డుకుంటామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి స్పష్టం చేశారు. బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పలు కార్మికల సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణచౌక్ వద్ద సోమవారం బ్లాక్ డే నిర్వహించారు. ఇక్కడ పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వాగేశ్వరిలో ఫార్మకో వారోత్సవాలు

తిమ్మాపూర్, సెప్టెంబర్ 23: రామకృష్ణకాలనీలోని వాగేశ్వరి ఫార్మసీ కళాశాలలో చల్మెడ ఆనందరావు వైద్య కళాశాల ఆధ్వర్యంలో 4వ జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ఫార్మకో విజిలెన్స్‌పై ఫార్మ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్ అవగాహన కల్పించారు. ఏడీఆర్ గురించి వివరించారు. అలాగే వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అసిమ్ అలీ వివిధ ఔషధాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వాగేశ్వరి ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఫార్మసీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, వైద్యకళాశాల హెచ్‌వోడీలు పుష్పలత, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

హుజూరాబాద్ టౌన్, సెప్టెంబర్ 23: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల మైదానంలో సోమవారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక జెండా ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. బాలబాలికలకు క్రీడలపై ఆసక్తి పెంచాలన్నారు. కాగా, జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో 32 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరీంనగర్ అర్బన్ జట్టు క్రీడాకారుల ప్రతిభ

కొత్తపల్లి, సెప్టెంబర్ 23 : హుజూరాబాద్‌లో నిర్వహించిన ఎస్జీఎఫ్ఐ అండర్–17 కబడ్డీ పోటీల్లో కరీంనగర్ అర్బన్ బాలికల జట్టు క్రీడాకారిణులు విజేతలుగా నిలిచారు. ఫైనల్ పోటీల్లో కరీంనగర్ అర్బన్, సైదాపూర్ జట్టు క్రీడాకారులు తలపడగా, అర్బన్ జట్టు క్రీడాకారిణులు విజయం సాధించారు. బాలుర విభాగంలో హుజూరాబాద్ జట్టు గెలుపొందగా, చొప్పదండి జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలుగా నిలిచిన జట్టు క్రీడాకారులను డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, ఎస్జీఎఫ్ఐ సెక్రటరీ, క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందించారు.

ఏటీఎంలో చోరీ నిందితుల అరెస్ట్

రాంనగర్ సెప్టెంబర్ 23: నగరంలోని ఎస్బీఐ ఏటీఎంలో చోరీకి పాల్పడిన నిందితులను వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం సాయంత్రం కరీంనగర్ పట్టణంలోని తారక్ హోటల్ ఎదురుగా ఉన్న ఎస్బీఐ ఏటీఎంలో డబ్బులు డ్రా చేయడానికి పేరుమల్ల భిక్షపతి అనే వ్యక్తి వచ్చాడు. పదివేల రూపాయలు ఏటీఎం నుంచి విత్ డ్రా చేయడానికి ఏటీఎం కార్డును పెట్టి పిన్ నంబర్ ఎంటర్ చేసిన తర్వాత డబ్బులు రాలేదు. అతను వెళ్లిపోగా, తర్వాత వెంటనే అక్కడే ఉన్న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రోహిత్ పాల్, సత్యవీర్ సింగ్ ఏటీఎంలోకి వెళ్లి అంతకుముందే వీరు కనబడకుండా అమర్చిన స్టీల్ క్లిప్ సహాయంతో పదివేల రూపాయలను తీసుకొని పారిపోయారు. సోమవారం నిందితులను ఎస్సై రాజన్న అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

ప్రమాదానికి కారణమైన వ్యక్తికి జైలు

వీణవంక, సెప్టెంబర్ 23: ట్రాక్టర్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి బాలుడి మృతికి కారణమైన కేసులో నిందితుడు జున్నూతుల మనోహర్‌రెడ్డికి 19 నెలల జైలు శిక్షపడినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బొంతుపల్లి గ్రామానికి చెందిన జున్నూతుల మనోహర్‌రెడ్డి 2003లో ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా, అతివేగంగా నడిపి బోల్తాపడగా అందులో ప్రయాణిస్తున్న జున్నూతుల రాజేశ్వర్‌రెడ్డి (9)కి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందగా, జున్నూతుల శ్రీనివాస్‌రెడ్డి, జున్నూతుల రాజేశ్వరమ్మ, చదువు శ్రీనివాస్‌రెడ్డి, చదువు వీరారెడ్డికి గాయాలయ్యాయి. మృతుడి తండ్రి శంకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం నిందితుడు మనోహర్‌రెడ్డిని హుజూరాబాద్ మున్సిప్ కోర్టులో ప్రవేశపెట్టగా మెజిస్ట్రేట్ 19 నెలల జైలుశిక్ష, రూ.6500 జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కేసులో నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన కోర్టు హెడ్ కానిస్టేబుల్ పంతంగి శ్రీనివాసులు, ఎస్ఐ తోట తిరుపతిని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జి, జమ్మికుంట రూరల్ సీఐ కిశోర్ అభినందించారు.

డ్యాంలో దూకి ఆత్మహత్యాయత్నం: కాపాడిన పోలీసులు

రాంనగర్, సెప్టెంబర్ 23 : నగర శివారులోని మానేరు డ్యాంలో బోటింగ్ చేస్తుండగా ఓ మహిళ ఆకస్మాత్తుగా నీటిలో దూకి ఆత్మహత్యకు యత్నించింది. బోట్ సిబ్బంది, లేక్ పోలీసులు అప్రమత్తమై సేఫ్టీ జాకెట్ల సహాయంతో కాపాడి హుటాహుటిన దవాఖానకు తరలించారు. ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన మహిళను నగరంలోని సుభాష్‌నగర్‌కు చెందిన సంధ్యగా గుర్తించారు.

సెల్ ఫోన్ అందజేత

గంగాధర, సెప్టెంబర్ 23 : మండల కేంద్రానికి చెందిన మల్యాల రాజేందర్ ఈ నెల 18న తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకుని గంగాధర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. www.ceir.gov.in వెబ్ పోర్టల్ ద్వారా ఫోన్ ఐఎంఈఐ నంబర్‌ను బ్లాక్ చేశారు. ఫోన్ దొరికిన వ్యక్తి తన సిమ్ కార్డును అందులో వేయగానే గంగాధర పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం గంగాధర పోలీస్ స్టేషన్‌లో రాజేందర్‌కు ఎస్ఐ నరేందర్‌రెడ్డి ఫోన్ అందజేశారు.

కారు ఢీకొని ఒకరి మృతి

రాంనగర్, సెప్టెంబర్ 23: దుర్శేడ్ సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొట్టగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. బొమ్మకల్‌కు చెందిన జేరిపోతుల ఆంజనేయులు సెంట్రింగ్ మేస్త్రీగా పని చేస్తున్నాడు. అతడికి భార్య సరితతో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటికి వెళ్లిన కొద్ది సేపటికి అతడి సెల్‌ఫోన్ నుంచి వేరే వ్యక్తి ఫోన్ చేసి ఆంజనేయులుకు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడని సరితకు సమాచారం ఇచ్చాడు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకునే సరికి ఫోన్ చేసిన వ్యక్తి వినోద్, అతడి స్నేహితుడు కలిసి అంబులెన్స్‌లో ఆంజనేయులును ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకోగా, అప్పటికే ఆంజనేయులు మృతి చెందాడని వైద్యులు పరీక్షించి నిర్ధారించారు. కాపాడేందుకు ప్రయత్నించిన వినోద్ ప్రమాదం జరుగుతుండగా ప్రత్యక్షంగా చూడడంతో ఆయన ఇచ్చిన సమాచారం మేరకు టీఎస్05ఎఫ్‌పీ6379 నంబర్ గల కారు ఢీకొట్టినట్లు గుర్తించారు. సరిత ఫిర్యాదు మేరకు కారు యజమానిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ తెలిపారు.

గురుకుల సమస్యలు పరిష్కరించాలి

తిమ్మాపూర్ రూరల్, సెప్టెంబర్ 23: గురుకుల విద్యాసంస్థల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముల్కల కుమార్, సెక్రటరీ జావీద్, టెమ్రీస్ రాష్ట్ర సెక్రటరీ భూపేందర్ కౌర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి, ఉపాధ్యక్షుడు స్వామి, సెక్రటరీలు ఓ. శ్రీనివాస్, రత్నాకర్ పాల్గొన్నారు.

వీణవంకలో దొంగల హల్‌చల్

వీణవంక, సెప్టెంబర్ 23: మండల కేంద్రంలోని రెండు షాపుల్లో మద్యం, వస్తువులు దోచుకెళ్లి దొంగలు హల్‌చల్ చేశారు. ఎస్ఐ తోట తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని నల్లపోచమ్మ వైన్స్‌లో చొరబడి రూ.35 వేల విలువ గల మద్యం బాటిళ్లతో పాటు షాప్‌లోని సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి డీవీఆర్ ఎత్తుకెళ్లారు. అలాగే పక్కనే ఉన్న శ్రీ వెంకటరమణ ఎలక్ట్రికల్స్ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ షాపులో ముందు షెట్టర్లు పైకిలేపి లోపలికి వెళ్లి సీసీ కెమెరాలు కట్ చేసి, డీవీఆర్‌తో పాటు మొత్తం రూ.45 వేల విలువైన సామగ్రి దొంగలించారు. వైన్స్ షాప్ యజమాని దాసం రఘుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర/కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 23 : నగరంలోని 11కేవీ మహాశక్తి టెంపుల్ ఫీడర్‌లో డీటీఆర్ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సంతోష్ నగర్, విద్యానగర్, బాలాజీ సూపర్ మార్కెట్, సెయింట్ జాన్ స్కూల్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్–2 ఏడీఈ సుధీర్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా రేకుర్తి ఎస్ఎస్–11లో డీటీఆర్ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 11నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు లొయోల కాలేజీ, వెజిటబుల్ మార్కెట్ ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ కే రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన

తిమ్మాపూర్, సెప్టెంబర్ 23: రామకృష్ణకాలనీలో గల వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో స్వావలంబన భారత్ అభియాన్ ఆధ్వర్యంలో ఎంటర్‌ప్రెన్యూషిప్‌పై ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సోలార్ ఎంటర్‌ప్రెన్యూర్ ఎండీ ఇంద్రసేనారెడ్డి, జుపిటల్ క్యాపిటల్స్ సీఈవో గండె సుధాకర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీజీబీ రిటైర్డ్ మేనేజర్ దామోదర్‌రెడ్డి, అధ్యాపకులు సతీశ్‌కుమార్, శ్రీభవానీ ఫీడ్స్ ఎండీ సత్యనారాయణ, రిటైర్డ్ యోగా మాస్టర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వం జీవో 25ను రద్దు చేయాలి

శంకరపట్నం, సెప్టెంబర్ 23: మండలంలోని మొలంగూర్, తదితర గ్రామాల్లో డీటీఎఫ్ సభ్యత్వ నమోదును సోమవారం జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ పల్కల ఆశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన 25 జీవోతో పేద మధ్య తరగతి విద్యార్థులు బడికి దూరమయ్యే ప్రమాదం ఉందని, సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే దానిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నం, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొత్తపల్లి, సెప్టెంబర్ 23 : కొత్తపల్లి పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990–91 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. కొత్తపల్లిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో 34 సంవత్సరాల తర్వాత ఒక్కచోట కలుసుకొని అప్పటి జ్ఞాపకాలను ఒకరితో మరొకరు పంచుకున్నారు. ఇందులో భాగంగా మరణించిన స్నేహితులకు ఆత్మశాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు.

మాల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవీందర్

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 23: కార్పొరేషన్ పరిధిలోని 22వ డివిజన్ అభ్యుదయ మాల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దండి రవీందర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, సహాయ కార్యదర్శులుగా జగన్, రమేశ్, కోశాధికారిగా రాజశేఖర్, కార్యవర్గ సభ్యులుగా సుధీర్, కనకయ్య, లింగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రజ్ఞా వికాస్ పోటీల్లో విజేతలకు బహుమతులు

విద్యార్థిని అభినందిస్తున్న కొమురయ్య

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 23 : జిల్లా కేంద్రానికి చెందిన పలువురు విద్యార్థులు ప్రజ్ఞా వికాస్ తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో పాల్గొని బహుమతులు అందుకున్నారు. ఇందులో భగత్‌నగర్ వివేకానంద విద్యానికేతన్ విద్యాసంస్థల విద్యార్థి జి. దేవా ద్వితీయ బహుమతి సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ సోగాని కొమురయ్య విద్యార్థిని అభినందించారు. అలాగే, పారమిత విద్యాసంస్థలకు చెందిన విద్యార్థిని కె, శ్రేష్ఠ బహుమతి అందుకోగా, విద్యార్థులు, విద్యాసంస్థల చైర్మన్ ప్రసాదరావు అభినందించారు.